



ఆ రోజు, లోకల్ వీక్లీ పేపర్లో ఓ మూలగా పడిన ప్రకటన చూస్తూనే, క్షణకాలం ఆలోచనలో పడి పోయాడు, ప్రఖ్యాత సైకియాట్రిస్ట్, డాక్టర్ చంద్రశేఖర్. ఆ ప్రకటనలోని ముఖ్యాంశాలు చదువుతున్న కొద్దీ, అతగాడి రక్తం వుడికిపోవటం మొదలెట్టింది.

''దీర్ఘవ్యాధులు, మానసికవ్యాధులూ, గాలులూ, పీడలూ, పిశాచాలూ వగైరాలతో బాధపడేవారు ... ఈ క్రింద ఇచ్చిన అడ్రెస్ ప్రకారం ... ఇక్కడ వెలసివున్న ''ఆదిపరాశక్తి తల్లి'' (జీవమున్న వ్యక్తికాదు. శిల !) కృపవల్ల స్వస్తత పొందగలరు. అలాటి వారం దరూ ఆ తల్లిని సేవించి, ఆమె దయకు పాత్రులై, ఆయురారోగ్యములను పొందు దురుగాక.''

ఇట్లు
పూజారి
''రామానుజాచారి.''

ఆ ప్రకటన సారాంశం అది !

రామానుజాచారి ... అవును ఆ గ్రామం పేరుకూడా సరిపోతోంది... పూజారి ... వీడు ... రామానుజం గాడు ... తన బాల్యస్నేహితుడు ! పూజలన్నా, పూజారులన్నా మండి పడేవాడు చిన్నప్పుడు. ఈనాడు ఇలా మారిపోయాడా ? రామానుజాన్ని గురించిన ఆలోచన రాగానే, ఒక్కసారిగా బాల్యమంతా గుర్తుకు వచ్చింది చంద్రశేఖర్‌కు. అతగాడి ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

ఆ పల్లెటూళ్ళో హైస్కూలు వుంది. పేరుమోసిన మోతుబరి రైతుకొడుకు చంద్రశేఖర్. కాలు కింద పెట్టనవసరం లేనంతటి సంపద వుంది వాళ్ళకు. పూజారి నరసింహాచారి కొడుకు రామానుజాచారి చంద్రశేఖర్‌కు క్లాస్‌మేటు. నరసింహాచారి అతి ఛాందసుడు. అతి

ఆచారం. అస్పృశ్యులనబడేవారు కంట బడినా చాలు, స్నానంచేసి వచ్చేవాడు, వాళ్ళని తిట్టిపోస్తూ ! అలా అస్తమానూ చన్నీటి స్నానంవల్ల, తరచూ దగ్గు, జలుబు, జ్వరంలాంటి సుస్తీలతో బాధ పడ్తుండేవాడు. ఇంటిల్లిపాదినీ, తన మడి, ఆచారాలు పాటించమని పీడి స్తుండేవాడు. నరసింహాచారి భార్య అలివేలమ్మ స్వతహాగా తెలివిగలదీ, నెమ్మదైనదీ. భర్త కోరిన విధంగానే మడి ఆచారాలు అమలు జరిపేదేగానీ- అర్థంలేని పద్ధతులనుమాత్రం మృదువుగానే విమర్శించేది. భర్తను మంద లించేది. అస్పృశ్యులొచ్చారని ఇంట్లోకి పారిపోవటం అవివేకమనీ, అస్పృశ్యత అన్నది మన మనసులోనే వుందనీ, అదో పెద్ద జబ్బులాటిదనీ, దానినుంచి మాత్రమే మనం పారిపోవాలనీ అంటూండేది. ఆరోగ్య విధులకోసమే ఆచారమనీ, ఆరోగ్యవిధులు సక్రమంగా అమలుజరపటంకోసం ఆచారాన్ని ఒక సాధనంగా వాడుకోవాలేగానీ, అంతకుమించిన అతిప్రచారం అనర్ధదాయకమనీ వాదిస్తుండేది.

పెద్దకొడుకు వెంకటాచారి, తండ్రిని మించిన ఆచారపరుడిగా పేరు తెచ్చుకుని, పెళ్ళిచేసుకుని, ఇల్లరికం వెళ్ళి, అక్కడే పౌరోహిత్యంచేస్తూ స్థిరపడి పోయాడు. చిన్నవాడైన రామానుజాచారికి మాత్రం, తన ఇంటి వాతావరణం గందరగోళంగా వుండేది. తల్లిని మాత్రం మెచ్చుకొనేవాడు తరచూ.

"ఈ వెధవ ఆచారాలన్నిటినీ పాతి పెట్టాలిరా శేఖర్ !'' అంటూండేవాడు కోపంగా.

"మా అమ్మ రోజూ పూజ చేస్తుంది ... మడి ఆచారాలను పాటి స్తుంది. అయితే ఆమె విధానంలో ఏదో శాంతి, ప్రశాంతి వున్నట్లు తోస్తాయి. మా నాన్న హడావుడిమాత్రం ఏ విధం గానూ సమర్థించలేకుండా వున్నానురా శేఖర్ ! నాకంతా అయోమయంగా వుంటోంది !" అని బాధపడేవాడు. స్కూల్లో కొందరు పిల్లలు రామానుజాన్ని ''చిన్న పూజారీ !" అంటూ పిలిచేవారు. ఆ పిలుపంటే కూడా అతగాడికి కోపంగా వుండేది. నరసింహాచారి, తన తర్వాత తన చిన్నకొడుకు రామానుజమే. ఆ గ్రామంలోని గుడికి పూజారిగా వస్తాడనీ (రావాలనీ !) ఆ గుడి తాలూకు మడిమాన్యాలు అనుభవించాలనీ అందరితో చెబుతుండేవాడు.

రామానుజాచారికిమాత్రం తను పెద్ద చదువులు చదివి డాక్టరు కావాలనీ, ఈ ప్రాంతంలోనే ఆస్పత్రి పెట్టి, రోగులకూ, దీనులకూ, ముఖ్యంగా—ఆర్థికంగా తగ్గుస్థితిలోవుండి, వైద్యంచేయించుకోలేక బాధపడ్తుండేవారికి వారి జబ్బులు ఉచితంగా నయంచెయ్యాలనీ వుండేది.

"ఛస్తే ఈ పూజారిపనికి ఒప్పుకోను ! వీళ్ళు పూజారులు కారు. పూజ 'అరులు'. మా నాన్న పూజపేరుతో చేసే మోసాలూ, "పూజారి" పదవి అన్నది దోచుకుతినటానికి మాత్రమే వుపయోగించుకోవచ్చునన్నట్లు ప్రవర్తించే ప్రవర్తనా, నా కాభావం కలిగిస్తోంది. శేఖర్ ! పవిత్రత లేని ఈ వృత్తి నా కనవసరం !" అనేవాడు ఉద్రేకంగా.

ఇంటర్ పాసై, ఎం.బి.బి.ఎస్. లో చేరాడు చంద్రశేఖర్. రామానుజం, వాళ్ళ నాన్న ఇక చదువు ఆపిస్తానన్న గోలచేస్తుంటే, తగవులాడి మరీ బి.ఎస్‌సి. లో చేరాడు. తండ్రి ససేమిరా డాక్టర్ కోర్సులో చేర్చనని చెప్పాడు. తనే ఎక్కువగా కట్నంతీసుకొని, పెళ్ళాడి, ఆ కట్నంతోనైనాసరే, డాక్టర్ కోర్సు చదవాలని కలలు కంటుండేవాడు రామానుజం.

కానీ ! రామానుజం కలలు ఇలా సాగుతుండగానే, హఠాత్తుగా, నరసింహాచారి మరణించాడు. ఇంటిదగ్గర వ్యవసాయం, పూజారి పని, విధిలేక స్వీకరించవలసి వచ్చింది రామానుజానికి. బి.ఎస్‌సి. మూడవసంవత్సరం పూర్తి కాకుండానే చదువుఆగిపోయింది. దేన్నుంచైతే తను తప్పించుకోవాలని చూశాడో, అదే వేయి బాహువులతో వచ్చి చుట్టుకుందతగాడిని.

శలవులకు వచ్చిన చంద్రశేఖర్ చాలా నొచ్చుకున్నాడు, రామానుజం ఇలాటి పరిస్థితుల్లో చిక్కుకున్నందుకు.

"దిగులుపడకురా రామానుజం ! నా పుస్తకాలూ, నోట్సులూ అన్నీ ఇస్తుంటాను. తీరిక సమయంలో క్షుణ్ణంగా చదువు. నీకు డాక్టర్ కోర్సు మీద అమితమైన ఆసక్తి వుంది. కాస్తంత బుర్రపెట్టావంటే, పరీక్ష రాయకున్నా డాక్టరువు కాగలవు. డాక్టర్ కోర్సు పాసయ్యీ, డాక్టర్లు కాలేకపోతున్న ఎందరో డాక్టర్లకంటే—నువ్వు నిజమైన డాక్టరువు కాగలవు !" అని ప్రోత్సహించి, పుస్తకాలూ, నోట్సులూ ఇస్తుండేవాడు.

రామానుజాన్ని ఇప్పుడందరూ 'పూజారి' అనే పిలుస్తున్నారు. చదువుకోవటానికీ, తను కోరిన వృత్తి చేపట్టటానికి వీలుకాకపోయిందన్న బెంగతో లోలోపల కుళిమిపోవటం, తిట్టుకుంటూ గుడికి వెళ్ళటం చేస్తున్న కొడుకును అలివేలమ్మ తరచూ మందలించేది.

"చూడు బాబూ ! మన జీవితం, మన ఇష్టప్రకారమే నడవాలంటే, కుదరదు నాయనా ! దేవుడిచ్చిన అవకాశాన్ని, అది ఏ రూపంలోనయినా ఇవ్వనీ, సక్రమంగా ఉపయోగించుకుంటే అందులోనే కొండంత తృప్తి దాగివుంటుంది. ఆశించింది అందలేదని అసంతృప్తిపడితే, ఇటు మనసుకూ

శాంతి వుండదు, అటు వృత్తికీ న్యాయం జరగదు.''

అలివేలమ్మ కోసారి పెద్ద జబ్బు చేసి, ఆమె ఇక జీవించదేమోనన్నంత గందరగోళం అయిపోయింది. దాంతో రామానుజానికి త్వరగా పెళ్ళాడాల్సిన అవసరమూ కలగటంతో, ఓ పేద ఇంటి అమ్మాయిని పెళ్ళాడి, ఇక అక్కడే స్థిరపడిపోయాడు పూజారిగా !

చంద్రశేఖర్ డాక్టర్ కోర్సు పూర్తి చేసి, ఓ గొప్పింటి అమ్మాయిని బోలెడంత కట్నకానుకలతో పెళ్ళాడి, భార్యను వెంటబెట్టుక ఫారిన్ వెళ్ళాడు. వెళ్ళేముందు రామానుజం దగ్గరకువచ్చి, తను ఫారిన్‌నుంచి వచ్చాక, డాక్టరుగా స్థిరపడి, డబ్బు ఎక్కువగా ఆర్జించాక, తప్పక రామానుజాన్ని డాక్టర్ కోర్సు చదివిస్తానని చెప్పాడు. రామానుజం నవ్వి వూరుకున్నాడు.

చంద్రశేఖర్ ఫారిన్‌లో ఐదేళ్ళుండి తిరిగి వచ్చాడు పెద్ద సైకియాట్రిస్ట్‌గా. ప్రాక్టీస్ బాగా వస్తోంది. ఫారిన్‌నుంచి వచ్చాక రామానుజాన్ని కలుసుకొనే అవకాశం దొరకలేదు. మానసిక వ్యాధులమీద పరిశోధన జరిపి, వాటికి చికిత్స చేయటంలో సిద్ధహస్తుడుగా మారాడు చంద్రశేఖర్. పైగా ఈ దేశంలో—జిల్లాకొకరుగా, రాష్ట్రానికి పదిమందిగా ... రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్న బాబాలూ, అమ్మవార్లూ, వారు చేసే మోసాలూ, అతగాడిలో విపరీతమైన జుగుప్సను రేకెత్తించాయి. ఓ వేపు సైకియాట్రిస్ట్‌గా వూపిరి సలపని ప్రాక్టీస్ చేస్తూనే, మరోవేపు, ఈ బాబాలూ, అమ్మవార్లూ, జనాన్ని ఎలా హిప్నటైజ్ చేస్తున్నదీ, గారడీలు చేస్తున్నదీ, మోసాలు చేస్తున్నదీ వివరంగా వ్యాసాలు వ్రాయటం మొదలెట్టాడు. కొన్ని ప్రదేశాలకు స్వయంగా వెళ్ళి ఉపన్యాసాలివ్వటం సాగించాడు. అతగాడి వ్యాసాలు పెద్ద పెద్ద ఇంగ్లీషు పత్రికలలో ప్రచురింపబడ్తూ, బహుళ ప్రచారం పొందుతున్నాయి...

రామానుజం కూడా, చంద్రశేఖర్ వ్యాసాలను మెచ్చుకుంటూ – "నీ హేతువాద దృక్పథం నాకెంతో ఆనందాన్ని కల్గిస్తున్నది. మోసం అనేది ఎక్కడ జరుగుతున్నా క్షంతవ్యం కాదు !" అంటూ రెండు మూడు ఉత్తరాలు వ్రాశాడు. ఆ ఉత్తరాలలోనే, తన జీవితం ప్రస్తుతం సాఫీగా జరిగిపోతున్నట్లు, ఒక కొడుకు – మూడో ఏడు వచ్చిందనీ, తల్లి కులాసాగా వుందనీ కూడా రాశాడు. వీలు చూచుకొని జవాబు వ్రాయాలనీ, వీలైతే, వెళ్ళి చూచి రావాలనీ, తన హేతువాద ఉపన్యాసాల యాత్రలో, ఎక్స్పరిమెంట్స్‌లోనూ, తనతోబాటు పాల్గొనేందుకు, తన వెంట వుండేలా (పెద్ద మొత్తం జీతంగా ఇచ్చి) – రామానుజాన్ని తన దగ్గరకు పిల్చుకోవాలనీ అనుకున్నాడు చంద్రశేఖర్.

అలా అనుకుంటున్నంతలోనే ఈ పత్రికాప్రకటన చూశాడు ఈ రోజు! ఆ మధ్యఎవరోతెలిసినవాళ్లువచ్చి "పూజారి" —(రామానుజం) అద్భుతంగా దెయ్యాలను వదిలిస్తున్నాడనీ, అంబపూజ ద్వారా జబ్బులు నయంచేస్తున్నాడనీ, చెప్పారు. నమ్మలేదు చంద్రశేఖర్.... కానీ ఈనాడు...?

* * *

"డాక్టరుగారున్నారా ?" ఎవరిదో కంఠం ఖంగుమనటంతో, చంద్రశేఖర్ మనసులో మెదులుతున్న గతమంతా చెదిరిపోయింది...వచ్చిన వ్యక్తికి సమాధానం చెప్పి పంపి–తిరిగి ఆలోచనలో పడ్డాడు చంద్రశేఖర్. రామానుజం ఇంతగా మారిపోయాడా ? విధిలేక పూజారిగా స్థిరపడిన రామానుజం, విధిగా మోసంచెయ్యటం వృత్తిగా పెట్టుకున్నాడా ? అతీత శక్తులున్నాయనే భ్రమ కల్పించి తద్వారా జనాన్ని అట్రాక్ట్‌చేసి, వారిచ్చే కానుకలూ, డబ్బూ ద్వారా, వారి అజ్ఞానాన్ని "కాష్" చేసుకుంటూ బ్రతికేస్తున్న చాలామంది దొంగ బాబాల, దొంగ అమ్మవార్ల లిస్ట్‌లో చేరిపోయాడా ?

ఎవరో చెప్పటం కాదు ! ఎవరి ద్వారానో వినటం కాదు. ఈ పత్రికా ప్రకటన ఓ ఆధారం దొరికింది. తనే వెళ్ళి స్వయంగా చూడాలి ! మిత్రుడు కాబట్టి, తన హేతువాదం అంతా బోధించి, ఋజువుచేసి, నచ్చచెప్పి, దారికి తేవాలి. దారికి రాకపోతే – మిగతావారి విషయంలోలానే, కర్కశంగా ప్రవర్తించి, పదిమంది ఎదుటా ఋజువుచేసి, పరువు తియ్యటానికైనా వెనుకాడడు తను ! తనకు శత్రువులూ, మిత్రులూ అన్న తేడా వుండకూడదు ! లేదు ! కృతనిశ్చయుడై బయల్దేరాడు చంద్రశేఖర్.

* * *

గుమ్మంముందు ఆగిన కారూ, అందులోనుంచి దిగివస్తున్న చంద్రశేఖర్‌ను చూచి, రామానుజం గబగబా ఎదురు వచ్చాడు. ఆనందంతో కౌగలించుకున్నంత పనిచేశాడు. క్షణకాలం రామానుజాన్ని పరిశీలనగా చూచిన చంద్రశేఖర్ నిర్ఘాంతపోయాడు. నుదుటిమీద విభూదిరేఖలు, భ్రుకుటిమధ్య ఎర్రని కుంకుమబొట్టు, ఆజానుబాహు విగ్రహానికి అధో కొత్త అందాన్ని సంతరింపజేసాయి. చిన్న పిలక ! వైష్ణవ సాంప్రదాయం ప్రకారం పెట్టే నామాలు— అడ్డరేఖలుగా మారాయా ?

''ఏమిట్రా అలా చూస్తున్నావ్ ?'' అన్నాడు రామానుజం నవ్వుతూ.

''ఓర్నీ ! 'పూజారీ!' అని పిలవాలనిపించేట్లే వున్నావురా !'' అన్నాడు

చంద్రశేఖర్ ఏ భావాలు పలకని గొంతుకతో.

''అలాగే పిలు! ప్రస్తుతం అందరూ నన్నలాగే పిలుస్తున్నారు. ఆ పిలుపే నాకూ బాగుంది. ''రామానుజం!'' అని ఎవరేనా పిలిచినా, నన్నుగాక, మరెవరినో పిలిచినట్లుగా అనిపిస్తోంది నాకు! రా! లోపలకు వెళ్దాం.'' అన్నాడు పూజారి నవ్వుతూ. భోజనాలూ, విశ్రాంతీ అయ్యాక, ''అలా అమ్మవారి గుడికి వెళ్ళొద్దాం పదరా శేఖర్! సాయంకాలం దీపారాధన చెయ్యాలి. భక్తులు చాలామంది వస్తారు!'' అన్నాడు పూజారి.

ఆ అవకాశంకోసమే కాచుకుని వున్నాడు చంద్రశేఖర్.

''నువ్వీమధ్య ఎంచక్కా ఓ 'బిజినెస్' పెట్టావని విన్నాను!'' అన్నాడు చంద్రశేఖర్, ఉపోద్ఘాతంగా, త్రోవలో.

''ఏం బిజినెస్?'' ఆశ్చర్యంగా చూచాడు పూజారి.

''అదే! దెయ్యాలూ, భూతాలూ వదలగొట్టడంలాటివి!'' వ్యంగ్యంగా అన్నాడు చంద్రశేఖర్.

''అది బిజినెస్ కాదే! దానివల్ల నాకు ఆదాయ మేమీలేదు కూడాను! నాకున్న పొలాలూ, వాటిలో పండే పంట, ఇంటి దగ్గర నా భార్య రెండు గేదెలమీద పాడిచేసి, నెయ్యి అమ్మించి చేసే చిన్న సైజు కుటీర పరిశ్రమా, నా ఈ పూజారి వృత్తిమీద వచ్చే ఆదాయమూ నాకు చాలు!'' అన్నాడు పూజారి నవ్వి. ''ఆ! అడపా, తడపా వైద్యం చేస్తుంటాను!'' అన్నాడు మళ్ళీ.



''మరైతే ఈ మోసం ఎందుకు చేస్తున్నట్లు? దెయ్యాలూ, భూతాలూ, లేవని నీకు తెలీదా? ఆ దెయ్యాలన్నవి మానసిక వ్యాధి లక్షణాలనీ, మానసిక బలహీనతవల్ల కలిగే భ్రమలనీ నీకు తెలీదా? ముఖ్యంగా ఈ పల్లె ప్రాంతాలలో మూఢనమ్మకాలలో మగ్గిపోతున్న ఎక్కువమందిలో, ఈ గాలులూ, దెయ్యాలూ మేనియా ఎక్కువగా వున్నవనీ నీకు తెలీదా? ఇంచుమించు డాక్టర్ కోర్సు అంతా చదివి (పరీక్ష వ్రాయకున్నా) ఎంతో విజ్ఞానమూ, ప్రపంచ జ్ఞానమూ తెలిసిననువ్వు, ఈ మూఢ ప్రజల మూర్ఖత్వాన్ని ఆధారంచేసుకుని, అది ప్రోత్సహించటం మోసంకాదంటావా? నేరంకాదంటావా? ఆత్మవంచనా, పరవంచనా కాదంటావా?'' చంద్రశేఖర్ అలా కోపంగా, ఉద్రేకంగా

అడుగుతుంటే, పూజారి పకపక నవ్వాడు.

''నవ్వుకురా పూజారీ ! పూజారీ నవ్వుకురా ! నవ్వుకు ! ఈ పల్లెప్రాంతాలలోని మూఢత్వాన్నీ, అజ్ఞానాన్నీ— నీకున్న విజ్ఞానంతో తొలగిస్తావని ఆశపడ్డాను. హేతువాద దృక్పథంతో ఆలోచించి వీళ్ళను ముందుకు నడిపిస్తావని ఆశించాను. కానీ...కానీ...''

చంద్రశేఖర్ మాటలు పూర్తి కాకముందే గుడి ఆవరణలోకి ప్రవేశించారిద్దరూ ! చిన్నగుడి, పెద్దప్రహరీ ... గుడిలో అమ్మవారి విగ్రహం, ఎర్రని పట్టు చీరెతో, కొద్దిపాటి నగలతో అలంకరింపబడివుంది. గుడి ఆవరణలో ఎందరో దెయ్యాలు పట్టినవాళ్ళు (అలా భ్రమపడుతున్న వాళ్ళు !) నేలమీదపడి పొర్లుతూ, ఏడుస్తూ, కేకలువేస్తూ గొడవ చేస్తున్నారు. చంద్రశేఖర్‌కు వాళ్ళని చూడగానే అర్థమైంది. జీవంలేనట్లున్న గాజు కళ్ళలాటి కళ్ళు, పిచ్చి చూపులూ, స్టడీగా కూర్చోలేక, నిల్చోలేక, పడుకోలేక, ఏదో 'అనీజీనెస్' ఫీలౌతూ, బోనులో పడవేసిన పులుల్లా 'రెస్ట్‌లెస్'గా వున్న ఈ లక్షణాలన్నీ మానసిక జబ్బులకూ — 'మెంటల్ డీ-కండిషన్'కూ సంబంధించినవి. వీటికి సరైన వైద్యం చేయించాలి. కొందరిని హిప్నటైజ్ చెయ్యటంద్వారా, మరి కొందరికి 'షాక్' ట్రీట్‌మెంట్సు ద్వారా, ఇంకా కొందరికి రోజుల తరబడీ—మైకంలో వుంచటంద్వారా, ఇలా రోగి, రోగ తీవ్రతనుబట్టి నిర్ణయించుకుని వైద్యం చెయ్యాలి. అంతేగానీ ఇలా...చంద్రశేఖర్ ఆలోచనలను చెదరగొడ్తూ — పూజారి కంఠస్వరం ఉచ్చస్వరంతో అమ్మవారి సహస్రనామం చదువుతున్నాడు ... అమ్మవారి విగ్రహం పాదాలమీద పూలు, కుంకుమ చల్లుతున్నాడు. అతగాడి గొంతుక ఒకే స్థాయిలో స్వచ్ఛంగా, సరళంగా సాగుతోంది ! గుడి వరండాలో నిల్చున్న చంద్రశేఖర్ ఒక్కసారిగా అవాక్కయిపోయాడు. ఆ మంత్రోచ్చారణలో ఏదో అవాఙ్మానస గోచరమైన శాంతి వున్నట్లనిపిస్తోంది ! ఆ మంత్రాలలో ఏదో దివ్యసందేశం దాగివున్నట్లనిపిస్తోంది. అంతలోనే వెన్నుమీద ఎవరో చరిచినట్లు ఉలికిపడ్డాడు చంద్రశేఖర్ ! తనలాటి హేతువాది—మంత్రాలు లేవనీ, దివ్యశక్తులు లేవనీ వాదించి, నిరూపిస్తున్న వ్యక్తికూడా అజ్ఞానంలో పడ్తున్నాడా ? ఎందర్నో హిప్నటైజ్ చేసి— ఎన్నెన్నో అద్భుతాలు సాధిస్తున్న, తన నీ వాతావరణం హిప్నటైజ్ చేస్తున్నదా ? ఛీ ... ఛీ ... తనది ఇనుప మనసు ! అది చలించకూడదు. కాదు కాదు ! ఇది దివ్యశక్తి కాదు. మంచి గానం వింటున్నపుడు కలిగే మైమరపులాటిది ! అందమైన దృశ్యం చూచినప్పుడు కలిగే అద్భుతమైన అనుభూతిలాటిది. అత్యంత సుందరతర నృత్యం చూచేటప్పుడు కలిగే ఆనందానుభూతిలాటిది. అంతే. అంతే. ఒక క్రమబద్ధమైన స్వరంతో చదువుతున్నాడు గనుక ... రామానుజానిది సహజంగా మంచి కంఠస్వరం గనుకా, తనకూ ఓ పరవశత్వంలాటిది కలిగింది. అంతే !

''బాబోయ్!'' ఎవరో స్త్రీ నిటారుగా లేచి నిల్చుని, జుట్టువిరబోసుకుని వెర్రి కేకవేయటంతో త్రుళ్ళిపడ్డాడు చంద్రశేఖర్. పూజచేస్తున్న పూజారి తిరిగి చూచి, చంద్రశేఖర్ వేపు భయపడవద్దన్నట్లుగా చూసి, తిరిగి అర్చన సాగించాడు.

ఆ స్త్రీకేసి చూశాడు చంద్రశేఖర్. వయసు పాతిక సంవత్సరాలలోపే వుంటుంది. అందంగానే వుంది. కానీ శారీరకంగా కూడా చాలా బలహీనం అయినట్లుంది. ఆ చేతులు గుంజుకోవటం, మెడ తిప్పటంలాటి లక్షణాలన్నీ హిస్టీరియాకు సంబంధించినవి. పల్లెప్రాంతాలలో, ఆడపిల్ల రజస్వల అయ్యీ కాకముందే పెళ్ళి చేస్తుంటారు (ఈ నాటికీ). ఆ వరుడైనా చిన్నవాడుగాక, ఏ పాతిక, ముప్ఫై ఏళ్ళవాడో— ఎన్నో రుచులు చవిచూచి, కొన్ని తెగుళ్లు — సుఖవ్యాధులూ కూడా వంటబట్టించుకున్నవాడో అయి వుంటాడు. పధ్నాలుగేళ్ళలో వున్న ఆ వధువు—అబోతులా — వుండే ఆ వరుని వెంట కాపురానికి వెళ్తుంది. ఇక అక్కడ అత్తలూ, ఆడబడుచులూ, మరుదులూ, తోటికోడళ్లు, వారి పెత్తనాలూ—భర్త అనాదరణ, భయమూ, రక్షణ లేకపోవటం వగైరాలతో 'కాన్ఫిడెన్స్' కోల్పోతుంది. సరైన తిండి సౌకర్యమూ వుండదు. మెల్లిగా ఆమెలో హిస్టీరియా మొదలౌతుంది ... అది దెయ్యంగా పరిణమిస్తుంది...

బహుశా ఈ స్త్రీ కూడా అంతే.

''నేను ... ఫలానా దెయ్యాన్నిరోయ్.'' ఆమె అరుస్తోంది. ఆమె చుట్టూరావున్న ఆమె బంధువులంతా ఆ దెయ్యం తాలూకు వివరాలు అడుగుతున్నారా 'దెయ్యాన్ని.'

''నీకేం కావాలి ?''

''ఏమిస్తే వదిలిపోతావ్ ?'' అలా.

ఆ స్త్రీ పిచ్చిగా అరచి అరచి పిచ్చిపిచ్చిగా తిట్టి తిట్టి అలసిపోయి, సొమ్మసిలినట్లు నేలమీదపడిపోయింది. పూజారి పూజ ముగించి వచ్చాడు. అతగాడి కళ్ళిప్పుడు జ్యోతుల్లా ఎర్రగా వున్నాయి. మరో కొత్తమనిషిని చూస్తున్నట్లనిపించింది, చంద్రశేఖర్‌కు. పూజారి ఆ స్త్రీ దగ్గరగా నడిచాడు. ఆమెమీద విభూతి చల్లాడు. కుంకుమ ఇచ్చాడు.

''నువ్వు ఏ దెయ్యానివో తెలిసి

పోయింది. ఇక అమ్మవారి ఆజ్ఞ అయిందీ నాకు! నా తడాఖా చూపిస్తాను ... మంత్రంవేసి కట్టుకడతాను. మర్యాదగా ఈ 'బాల'లో నుంచి వెళ్తావా ? సరే వుంది. లేదా ... నరకయాతన పెడ తాను. జాగ్రత్త, ఆ!" అన్నాడు పూనకంవచ్చినట్లు వూగిపోతూ —ఆ స్త్రీ కళ్ళలోకి గుచ్చిగుచ్చి చూస్తూ.


కాస్సేపు ఆ యువతి అటూ, ఇటూ వూగింది. తర్వాత ఆమెలోని దెయ్యం, తనకు వేడి వేడి గారెలుకావాలనీ, మంచి చీరె, రవికె ఇస్తే వెళ్తాననీ చెప్పింది. పూజారి ఆమె బంధువులను పిలిచి చెప్పాడు. "ఆ దెయ్యం కోరినవన్నీ—ఏమరకుండా చేసిపెట్టండి. తిన్నవరకూ తిననీండి. అలిసి నిద్రపోనీండి. పది రోజులు గడిచాక, అమావాస్యనాడు గ్రహం వదిలిపోతుంది. అప్పుడు మందిస్తాను. గ్రహం ఈమెలో వున్నంత వరకూ మందు పట్టదు. దెయ్యం పట్ట నివ్వదు.''

అందరూ భక్తిగా తలూపారు. ఆ దెయ్యాన్ని నడిపించుక తీసికెళ్ళారు.

''ఫూలిష్ !'' అన్నాడు చంద్రశేఖర్ కోపంగా, మెల్లిగా, పూజారికిమాత్రం వినపడేలా.

''డోంట్ బీ ఎమోషనల్ మై డియర్ ఫ్రెండ్. వెయిట్! వెయిట్ ఎండ్ సీ !'' అన్నాడు పూజారి కూడా రహస్యంగా.

ఆ తర్వాత మరో పదిమంది — ఇదే తంతు ఇంచుమించుగా జరిగింది. ''మొండిగ్రహం'' అనిపించినవారిని ''తిన్నగా ఇంటికి రండి. నలభై రోజులు పూజచెయ్యాలి. పొంగలి, వడలు, వగైరాలు నైవేద్యాలు — ఆ గ్రహానికి పెట్టాలి...గసాలూ, మరికొన్ని దినుసులు కూడా కావాలి...వాటిఖర్చు మీరు పెట్టుకొండి చాలు. పూజ నే చేస్తాను.'' అని చెప్పాడు పూజారి. వాళ్ళు సంతోషంగా అంగీకరించారు. బాగా చీకటి పడ్డాక, అందరూ వెళ్ళిపోయాక, గుడి తాళంవేసి, ఇద్దరూ ఇంటిదారి పట్టారు.




''ఒరేయ్ పూజారీ. ఈ మోసం... ఈ దగా...ఈ కుట్ర నువ్వెనా చేస్తున్నదీ" అన్నాడు చంద్రశేఖర్ పళ్లు పటపట కొరుకుతూ.

"నేనే. ఇంకా సందేహంగా వుందేమిటి ?" అన్నాడు పూజారి నవ్వుతూ.

"సిగ్గులేదూ ఆ మాటనటానికి ?" ఆవేశంగా అరిచాడు చంద్రశేఖర్.

"లేదు. నే చేస్తున్నది మానవసేవే కానీ, మోసంకాదని నా అంతరాత్మకు తెలిసివున్నప్పుడు, సిగ్గెందుకుపడాలి ? సైకియాట్రిస్ట్‌గా, కేసులు తీసుకోవటానికి నువ్వు సిగ్గుపడుతున్నావా ?" పూజారి నవ్వుతూ అడిగాడు.

"నేను కేసు స్టడీచేసి మందులిస్తాను..."

"నేనూ అంతే." పూజారి అన్న మాటలకు అడ్డొస్తూ అరిచాడు చంద్రశేఖర్. "ఇందాక నేను చూసిందంతా..."

అతగాడి మాటలు పూర్తికాకుండానే అన్నాడు పూజారి "ట్రీట్‌మెంటులో ఓ భాగం...డియర్ ఫ్రెండ్ ... అదో ఆ కనిపిస్తున్న తిప్పదగ్గర కూర్చుందాం కాస్సేపు...మెల్లిగా మాట్లాడుకుందాం."

తిప్పదగ్గరగా వెళ్ళి కూర్చున్నారిద్దరూ. ఆ సమయంలో అక్కడికి మనుషులెవరూ రారు సాధారణంగా. పూజారి మొదలెట్టాడు...

"ఇందాక నీవు చూసిన మనుషులలో ఎవరికీ ఏ గ్రహాలూ, దెయ్యాలూ లేవని నీకెలా తెలుసో, నాకూ అలానే తెలుసు. వాళ్ళందరికీ వున్నది శారీరక, మానసిక రుగ్మతలు మాత్రమే. కొందరివి రొంపి సంసారాలై దిక్కు—తోచక, ఇంట్లోవాళ్ళ మీద కోపం, కసి, చేతగాని కక్ష, లోలోపల కరుడుగట్టి-ఎదురుగా వాళ్ళని తిట్టలేక, దెయ్యాన్ని ఆవహింపచేసుకొని—దానిద్వారా తిట్టేస్తారు. భర్తలవల్ల "సెక్స్" సంతృప్తిపొందని స్త్రీలూ... వారిలో అణచబడివున్న నిరాశా నిస్పృహలూ, కట్టుబాట్లను ఛేదించుకోలేని భయాలూ, అన్నీకలిపి, దెయ్యాలరూపాలలో బయటపడ్తాయి కొందరికి. మరి కొందరు వుట్టినే "దొంగ వేషాలు" వేస్తుంటారు. వీళ్ళందరి మన స్తత్వాలూ నాకు క్షుణ్ణంగా తెలుసు. నిజమైన జబ్బులు ఎవరికో, నటన ఎవరిదో ఇట్టే పసిగట్టగలను. అందుకే మనిషినీ,

మన స్త్రీత్వాన్నీ, ఆ జబ్బునిబట్టీ- ముందస్తుగా గ్రహం వదలగొడతాను. ఆ తర్వాతే మందుపుచ్చుకోమని సలహా ఇస్తాను. నువ్వు గమనించే వుంటావు... ఎక్కువగా ఆడవాళ్ళకే వస్తాయి ఈ దెయ్యాలూ, గాలులూ. నూటికి కోటికీ ఒక్క మగాడికి వుంటుంది "గాలి." బహుశా వాడిభార్య లేచిపోయో, వీడిమాట వినకో, లేదా, వీడు తలిదండ్రుల మాట విని—భార్యను నిర్లక్ష్యం చేయటంతో, ఆమె ఆత్మహత్య చేసుకోవటంవల్ల—లోలోపల తన పొరబాటు తాలూకు పశ్చాత్తాపమో...బయటకు చెప్పుకోలేని కారణం మరేదో వుంటే — మగాడికి 'గాలి' దెయ్యం—వస్తుంది."

పూజారి వేపు విస్మయంగా చూశాడు చంద్రశేఖర్.

"ఇన్ని తెలిసిన నువ్వు ఈ మూఢత్వాన్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నావురా ? నాలాటి సైకియాట్రిస్ట్‌ను సంప్రదించమని చెప్పలేవూ ప్లెయిన్‌గా ?"

పూజారి పకపకా నవ్వాడు. "డియర్ ఫ్రెండ్ ! నువ్వు డబ్బులో పుట్టి, డబ్బులో పెరిగావు. నీకు డబ్బంటే లెక్కలేదు. కానీ ఈ దేశంలో ... డబ్బునుబట్టి రోగాలు రావు. సరైన వైద్యం జరగాలంటే, ఎందరి కా వసతి వుందో ఒక్కసారి ఆలోచించు."

చంద్రశేఖర్ గతుక్కుమన్నాడు.

"పిచ్చాసుపత్రులలోవేస్తే, అక్కడా 'ఇజాలు' డబ్బునుబట్టి వైద్య సదుపాయాలు ... ఓసారి పిచ్చాసుపత్రిలో అడుగెట్టి, అదృష్టవశాత్తూ బాగై తిరిగి వచ్చిన వ్యక్తిని — బంధువులూ, చుట్టుప్రక్కలవాళ్ళూ, సమాజమూ 'పిచ్చి' వాళ్ళుగానే తరిమి తరిమి, తిరిగీ పిచ్చెక్కిస్తారు కదా ?" పూజారి చెప్పటం ఆపి, స్నేహితుడి వంక చూశాడు.

చంద్రశేఖర్ నిట్టూర్పు విడిచాడు.

అవును. అది నూటికి నూరు పాళ్ళ నిజం. పిచ్చినయం చెయ్యటం పెద్దకష్టమైన పని కాదు. కానీ, నయంచేసి ఇంటికి పంపాకే — ఆ ఇంట్లోవాళ్ళు ఆ వ్యక్తిని పిచ్చి పిచ్చి అని 'ఐసొలేట్' చేయకుండా వుండటమే ముఖ్యం. అలా చేసిన మరుక్షణం, ఆ వ్యక్తిలో కాన్ఫిడెన్స్ పోయి, తిరిగీ మెంటల్ బాలెన్స్ తప్పుతుంది. శాశ్వతంగా పిచ్చివాళ్ళుగా మారిపోతారు. ఇలాటి ఎన్నో కేసులు చూశాడు తను.

"నీలాటి సైకియాట్రిస్ట్ దగ్గర వైద్యం చేయించుకోవాలంటే, వేల డబ్బు కావాలి. అవునా?" చంద్రశేఖర్ ఆలోచనలు చెదరగొడ్తూ అడిగాడు పూజారి.

చంద్రశేఖర్ పలకలేదు. నిజమే! తన డిస్పెన్సరీ ఎక్విప్‌మెంటుకూ, షాక్ ట్రీట్‌మెంట్స్‌కూ, ఆర్డినరీ ట్రీట్‌మెంటుకూ, చాలా ఖర్చు వుంటుంది.

"నువ్వయినా ఇలాటి పేషెంట్లను ఎలా ట్రీట్ చేస్తావు ? కొందరిని హిప్నటైజ్ చేస్తావు. 'మీకేం జబ్బు లేదు' అని పదే పదే ఆ భావం రానిచ్చి కాన్ఫిడెన్స్ ఇస్తావు. మరి కొందరికి 'మెంటల్‌గా అటెంక్షన్'లో వుండే 'నెర్వ్స్', సిస్టమ్‌ను కంట్రోల్ చెయ్యటానికి కరెంట్ షాక్స్ ఇస్తావు. నిద్ర మాత్ర లిస్తావు. తద్వారా ఆ టెంక్షన్‌నే గాక, అసలు మెదడు నరాల ఫంక్షన్‌నే స్ప్రెస్‌చేసి, మైండ్ మొద్దుబారిపోయేలా చేస్తావు. అవునా ? పేషెంటుకు కాన్ఫిడెన్స్ ఇస్తావు. వారి బంధువులకూ జాగ్రత్తలు చెబుతావు. వాళ్ళు బుద్ధిలేనివాళ్ళైతే, తిరిగి మరో ఆరు నెలలలో ఆ కేసు నీ దగ్గరకే వస్తుంది."

'ఎస్, కరెక్ట్." అరిచాడు చంద్రశేఖర్. "ఇంతకూ ఈ సోదికీ, నీ మోసానికీ సంబంధమేమిటో చెప్పావు కావు." అన్నాడు అసహనంగా.

"పాయింటుకే వస్తున్నానురా తండ్రీ. పైకి చెప్పుకోలేని, అనుభవించలేని, ఎన్నో సమస్యలు మధ్యతరగతి, అంతకు తక్కువ తరగతి జీవితాలలో వున్నాయిరా శేఖర్. ఆ స్త్రీలలో కాన్ఫిడెన్స్ పోయి, శారీరకంగా బలహీనులు కాగానే, మానసికంగా తమ కేదో ఆవహించిందన్న భ్రమలో పడిపోతారు. చుట్టు ప్రక్కల వాళ్లు ఆ భ్రమను పెంచి, పోషిస్తారు. కారణం దారిద్ర్యం, అజ్ఞానం.

ఆ అభాగ్యులను—దరిద్రులనూ, నా మంత్రోచ్చారణతో 'హిప్నటైజ్' చేస్తాను. ఓ అద్భుతశక్తి ... అతీతశక్తి...దివ్యశక్తి ... తమ వ్యాధులూ, బాధలూ, గ్రహాలూ తొలగిస్తుందన్న నమ్మకాన్ని వారిలో కలిగిస్తాను. 'నీ బాధ ఆ దివ్యశక్తి పోగొట్టుతుంది' అన్న 'కాన్ఫిడెన్స్' కలిగిస్తాను. వాళ్ళకోసం పూజలు చేస్తాను. అందుకు అదనంగా పైసా పుచ్చుకోను, టెంకాయలు వగైరా చిన్న చిన్న ఖర్చులు తప్ప. (అది వారు సంతోషంగా ఇస్తారు.) ఆ ఖర్చులమీద, ఆ ఆదాయం మీదా బ్రతకాలన్న కోరిక నా కేనాడూ లేదురా శేఖర్."

"మరి పొంగళ్లు, పాయసాలూ, వడలూ వగైరాలన్నీ ఎందుకూ ?" చంద్రశేఖర్ నమ్మలేనట్లు అడిగాడు.

"అవా ?" పూజారి పకపక నవ్వాడు. "శారీరకంగా, మానసికంగా, బలహీనులుగా వుండే ఆ వ్యక్తులు సరిగా తిండి తినరు. గమనించి ఇంట్లో వాళ్లు పెట్టరు. పూజ పేరుతో, దెయ్యం పేరుతో, పుష్టికరమైన ఆహారం పెట్టిస్తాను. గసాలు—గసాలు నీళ్ళలో నానవేసి, రుబ్బి, అ పాలు తీసి, చక్కెర వేసి ఇప్పిస్తాను. ఎందుకు ? నిద్ర కోసం. మంచి నిద్రపడుతుందావ్యక్తికి. పుష్టికరమైన ఆహారం, మంచి నిద్ర

రావటంతో, బలంవచ్చి, పూజ నలభై రోజులూ పూర్తయేసరికి ఆ వ్యక్తి ఆరోగ్యం బాగుపడుతుంది. హిప్నటైజ్ చేసి గ్రహం వదిలిందనీ, వదిలించాననీ చెప్పి, ఆ తర్వాత మందులు వాడతాము." చంద్రశేఖర్ అవాక్కైగా చూస్తుండిపోయాడు. ఇది నిజమేనా ? అన్నట్లున్నా యతగాడి చూపులు.


"శేఖర్ ! ఎదుటి మనిషిలోని బలహీనత ఆధారంగా—వారిని మోసగిస్తే అది తప్పు. అదీ నేరం. అలాటి కొందరు బాబాలనూ, అమ్మవార్లనూ, పూజార్లనూ నువ్వు దుయ్యబట్టినా, వారి బండారం బయటపెట్టినా నాకు సంతోషమే. నేనూ నీకు సహకరిస్తాను.

కానీ—ఎందరో దీనులు...మరెందరో అభాగినులు ... ఇంకెందరో పేదలు... ఏదో దివ్యశక్తి తమను కాపాడుతుందని (అది నీ హేతువాదానికి అందక పోవచ్చు ... అలా అని ఈ సృష్టిని సక్రమంగా నడిపే శక్తి అంటూ ఒకటి లేదనటం అవివేకం ... అజ్ఞానం ... అహంకారం.) నమ్మి ... తమ బాధలు తొలగించుకుందామనుకున్నపుడు, వారికి నా వంతు సహకారం నేను ఇస్తే తప్పా ? అది మోసమా? కుట్రా ?" తీక్షణంగా అడిగాడు పూజారి. అతగాడి గొంతుకలో నిర్భీతి...నిండివుంది.

"పోనీ—ఈ మంత్రాలూ, తంత్రాలూ, నువ్వు నమ్ముతున్నావా ? నమ్మే పూజలూ, జపాలూ, అచరిస్తున్నావా ?" చంద్రశేఖర్ నీరసంగా అడిగాడు.

"తప్పకుండా. ఒకప్పుడు మానాన్న అతి చాదస్తంగా అమలు జరిపితే అసహ్యించుకునేవాణ్ణి. కానీ ఈనాడు — అవి సక్రమంగా చేస్తే ఎంత శక్తివంతమైనవో నా అనుభవంద్వారా తెలుసుకున్నాను."

"ఏమిటీ ?" చిత్రంగా చూశాడు చంద్రశేఖర్.




"చిత్తశుద్ధితో చేసే ఏ పని అయినా పవిత్రమైందే శేఖర్. నీకు నీ డాక్టర్ వృత్తి ఎంత పవిత్రమైందో, నాకు ఈ పూజారి వృత్తీ అంతే పవిత్రమైంది. డాక్టర్లలో—కొందరు మోసగాళ్లు లేరా ? అలాగే పూజారులలోనూ వున్నారు. అలాటివారు పూజ + అరులు. కాదనను. నీకు నీ కేసులు డబ్బు తెస్తాయి. నాకు ఈ చల్లని తల్లి ... ఆ దివ్యశక్తి ... నా పరోపకారంద్వారా అన్నం పెడుతోంది. నీకు నీ వృత్తిపట్ల గౌరవం, గర్వం వున్నాయి. నాకూ అవే వున్నాయి. హేతువాద దృక్పథంతో నీవు మోసగాళ్ళను విమర్శిస్తావు. నేను దివ్యశక్తి పేరుతో ఆ పనే చేస్తున్నాను.

దొంగవేషాలు వేసేవారిని, ఇంటికి పిలిపించుకొని — పదిమందిలో పరువు తీస్తే, వాళ్ళ కాపురాలు పాడైపోతాయి. వాళ్లు జీవచ్ఛవాలుగా మారిపోతారు... అందుకని చాటుగా చీవాట్లువేసి పంపుతాను. పైకిమాత్రం గ్రహం వదిలించానని చెబుతాను. అసలు మంత్రం అన్నది ఏమిటి శేఖర్ ? పవిత్రమైన భావాన్ని పదేపదే మననం చెయ్యటమే. అది ఎదుటివారికి మేలుచెయ్యాలని పదేపదే కోరుకోవటం. తేలు మంత్రం, పాము మంత్రం...అన్నీ అవే."

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా వింటున్నాడు.

"శేఖర్ ! నీకు 'ఓవర్ కాన్ఫిడెన్స్' ఎలావుందో, నాకు 'విల్ పవర్' అలా వుంది. నీతిగా, నిజాయితీగా, నియమబద్ధంగా వుంటాను. ఎందుకో తెలుసా ? అంత కఠోరంగా నిస్వార్థంగా వున్నపుడే మనకు 'విల్ పవర్' వస్తుంది. ఆ సిన్సియారిటీ వల్లే ఎదుటివారిని 'హిప్నటైజ్' చేయగలశక్తి వస్తుంది.

ఆ పవర్‌తోనే— నేను పూజలు — ఆ బాధాతప్తుల పేరుతో చేస్తాను ... వారా బాధనుండి విముక్తిపొందాలని మనసా, వాచా, కోరుకుంటాను ... 'హేతువాదంతో పరిశీలించినా, ఆస్తిక, నాస్తిక తత్వాలతో తర్కించినా, మానవ మేథ కందని—ఏదో ఓ దివ్యశక్తి వుంది ... అది ఈ దీనుల బాధ పోగొట్టుగాక." అని కోరుతాను. అదే నా మంత్రం. అదే నా తంత్రం. అయితే, రోగిని పరీక్షించటానికి నీకు పరికరాలూ, హాస్పిటలూ, రూములూ, ఆ వాతావరణమూ ఎంత అవసరమో—నాకూ ఈ వాతావర

ణమూ, గుడీ, **విగ్రహమూ**, పూజ– విభూది, కుంకుమా, ఇవన్నీ అంతే అవసరం.

దెయ్యాన్నీ– గ్రహాన్నీ – బాధనూ వదలగొట్టాక, ఇక్కడ ఆ వ్యక్తిని మామూలుగా చూస్తారు. గ్రహంవల్లే ఆ వ్యక్తి అలా పిచ్చిగా ప్రవర్తించిందే గానీ, ఆ వ్యక్తికి స్వతహాగా పిచ్చి లేదనీ, జబ్బులేదనీ, వెర్రిచేష్టలు చెయ్య దనీ నమ్ముతారు. మామూలు సమాజంలో ఆ వ్యక్తి – అందరిలా కలిసి పోయే అవకాశం వుందిక్కడ. కానీ పిచ్చాసుపత్రులనుంచి వచ్చిన వారికా అవకాశం లేదే. ఈ జనం అంతా ఐశ్వర్యవంతులై, విద్యాధికులై, సంస్కారపూరితులై –అన్నిటి తేడాలూ తెలుసుకున్నరోజు నాబోటివారి కిలాటి శ్రమ వుండదు. అప్పుడు గ్రహాలూ, దెయ్యాలూ వుండవు ... జబ్బులూ, డాక్టర్లూ, ఆసుపత్రులే చాలు.

కానీ, ఆ మార్పు ఇంకెన్ని తరాలు జరిగితే వస్తుందో. అందాకా... నాలాటి వారు కొందరైనా, చిత్తశుద్ధితో – ఈ దీనులను కాపాడవలసిందే. ఏమంటావ్ ?"

చంద్రశేఖర్ మాట్లాడలేదు. పూజారి వంక విస్మయంగా చూస్తూ కూర్చుండి పోయాడు. పూజారి ముఖంలోని పట్టుదలా, నిస్వార్థమూ, అద్భుతమైన వివేచనా జ్ఞానమూ అతగాణ్ణి వుక్కిరి బిక్కిరి చేసివేస్తున్నాయి...

"మా అమ్మ చలువవల్ల ... నేను చాలా విషయాలు తెలుసుకున్నానురా శేఖర్. ఓ విధంగా ఆమె నాకు గురువు.

ఒకప్పుడు నేనూ నాస్తికవాదినే. అసలు అస్తికతైనా, నాస్తికతైనా, హేతువాదమైనా, ఓ ఉన్మాదం లాటివి. ఏదైనాసరే, పదిమందికి నిజమైన మేలు జరిగేదిగా వుంటే అదే పవిత్రమైన వృత్తి. ప్రవృత్తి. అదే నా మతం. అదే నా మనసుకు సమ్మతం. ఏమంటావ్‌రా **పూజ అరీ**." చివరగా పకపకా నవ్వాడు పూజారి.

ఆ నవ్వులోని పవిత్రతకూ, స్వచ్ఛతకూ, సరళతకూ దిగ్భ్రాంతి చెందాడు చంద్రశేఖర్.

"లే ! లే ! పొద్దుపోయింది. ఇంటికి వెళ్దాం. చివరగా ఒక మాటరా శేఖర్. నిజమైన మోసాలు చేసేవారిని దుయ్యబట్టు. వారి భండారం బైటపెట్టు. కానీ నూటికీ కోటికీ ఒకరుగావుండే నిజమైన యోగులనూ, సేవాపరాయణులనూ, పూజారులనూ, ఒకే గాటకట్టి అవమాన పరచకు. దెబ్బతింటావు." అన్నాడు పూజారి నవ్వుతూ లేచి నిలబడుతూ. చంద్రశేఖర్ లేచాడు. ఆ రాత్రి పడుకున్నాడేగానీ నిద్రరాలేదు. ఎందరి కోసమో, కఠోర నియమాలు, అమలు జరుపుతున్న అకుంఠితదీక్ష, సేవాతత్పరుడైన పూజారిముఖం వేయిదీధులతో కనిపిస్తోంది అతగాడి కళ్ళముందు. ఎందరో దీనులకోసం, ప్రాణాయామాలు, ఉపవాసాలూ–సత్ప్రవర్తన, సత్శీలత– అసిధారావ్రతంలా సాగిస్తూ, తనమీద, తన మానసిక శక్తులమీదా, అఖండ విజయం సాధించిన, సాధిస్తున్న పరోపకారి – పూజారిమూర్తి నిలుస్తోం దతగాడి కనుపాపలలో.

తనూ – ఓ ప్రయోజనం కోసమే పోరాడుతున్నాడు. పూజారీ అంతే. తను ఎక్కువలో ఎక్కువగా, సంవత్సరానికి ఓ వందమందికి ట్రీట్‌మెంటు ద్వారా (ఆ ఖర్చు భరించుకోగలిగిన వాళ్ళకుమాత్రమే.) నయం చేయగలడేమో. కానీ ఈ పూజారి కొన్నివేల మందికి బాగుచేసి పంపుతున్నాడు. వారు తిరిగి మామూలు మనుషులుగా జీవించే అవకాశం కల్పిస్తున్నాడు.

"పూజారీ ! ఇలాగే సాగిపో. నీ మార్గంలో నువ్వు నిష్కంటకంగా సాగిపో." అనుకున్నాడు చంద్రశేఖర్ ఆ తెల్లవారుఝామున.

మరునాడు తన దగ్గర వీడ్కోలు తీసుకొని, కారులో కూర్చున్న స్నేహితుడివంక, నవ్వుతూ చూస్తూ, చెయ్యి వూపాడు పూజారి.

